క్లుప్తంగా

'పొన్నం'కు శుభాకాంక్షలు



మాట్లాడుతున్న బీసీ సంఘ నాయకులు

జన్నారం: హైదరాబాద్ ఎల్బీస్టేడియంలో రాష్ట్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పొన్నం ప్రభాకర్‌కు జన్నారం మండల బీసీ ఉద్యమ పోరాట సంఘం నాయకులు శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ భవిష్యత్‌లో పొన్నం ప్రభాకర్ మరిన్ని పదవులు చేపట్టాలని ఆశాభావం వ్యక్తంచేశారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా కన్వీనర్ కొడూరి చంద్రయ్య, కోకన్వీనర్ నర్సయ్య, కరీంనగర్ జిల్లా కోకన్వీనర్ నర్సింహులు, సంఘ నాయకులు భాస్కర్‌గౌడ్, లక్ష్మీనారాయణ, గంగయ్య, రాజన్న, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులకు ప్రశంసపత్రాలు



ప్రశంసపత్రం అందిస్తున్న ఎంపీడీవో

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లోని పంచాయతీల్లో కార్యదర్శులు అసెంబ్లీ ఎన్నికల విధుల్లో సక్రమంగా చేసినందుకుగాను వారికి శుక్రవారం ఎంపీడీవోలు ప్రశంసాపత్రాలు అందజేశారు. రిటర్నింగ్ అధికారి, అడిషనల్ కలెక్టర్ రాహుల్ ఆదేశాల మేరకు ప్రశంసపత్రాలు అందించినట్లు ఎంపీడీవోలు జవహర్, రాధాకిషన్ తెలిపారు.

బీఆర్‌ఎస్ పార్టీకి మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం రాజీనామా పత్రాన్ని బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడికి పంపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలు, మహిళల కోసం ప్రత్యేక పథకాలకు ఆకర్శితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. కాగా, గురువారం ఆమె స్థానిక ఎమ్మెల్యే వినోద్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరాక శుక్రవారం ఈ ప్రకటన విడుదల చేయడం గమనార్హం.

రగ్గుల పంపిణీ



వృద్ధులకు రగ్గులు అందజేస్తున్న పాస్టర్

భీమారం: క్రిస్మస్ పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో చర్చి పాస్టర్ సల్మాన్‌రాజ్, తిరుపతి కలిసి 50మంది వృద్ధులకు శుక్రవారం రగ్గులు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ భూలక్ష్మి, సుధీర్‌నాయక్, శోభ పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు అందిస్తున్న సభ్యులు

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో నవయువతరం యూత్ కమిటీ సభ్యులు శుక్రవారం పేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున తమవంతుగా దుప్పట్లు అందించినట్లు సభ్యులు తెలిపారు. యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వరిలో పంట కోత ప్రయోగం



పంట కోత ప్రయోగం చేస్తున్న అధికారులు

భీమిని: మండల పరిధిలో ఏఈవో వినోద్‌కుమార్ పలువురు రైతులు పొలాల్లో శుక్రవారం పంట కోతప్రయోగం చేపట్టారు. వరిలో ఎకరాకు దిగుబడి అంచనా కోసం పంట కోత ప్రయోగం చేపట్టినట్లు ఏఈవో తెలిపారు. గ్రామాలవారీగా పంటలపై ప్రయోగాలు చేసి దిగుబడిని అంచనావేసి జిల్లా స్టాటస్టిక్ అధికారులకు పంపనున్నట్లు పేర్కొన్నారు. రైతులు సంతోష్, మురళీధర్, పీర్‌మహ్మద్, నర్సింగం ఉన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణమెప్పుడో!

- నర్సింగాపూర్‌లో రెండేళ్ల క్రితం మంజూరు
- స్థలం కేటాయించినా ప్రారంభించని పనులు
- సబ్‌స్టేషన్ పూర్తయితే మెరుగైన విద్యుత్ సరఫరా



నర్సింగాపూర్‌లో సబ్‌స్టేషన్‌కు కేటాయించిన స్థలం

భీమారం: మండలంలోని నర్సింగాపూర్ పరిధిలో రెండేళ్ల క్రితం 33 కేవీ/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైంది. ఇప్పటికి నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. నాణ్యమైన విద్యుత్ అందించేందుకు సబ్‌స్టేషన్ నిర్మించి పూర్తిచేస్తారనుకున్న ప్రజలకు నిరాశే మిగిలింది. మండలంలోని 11 గ్రామాలకు గాను భీమారంలో సబ్‌స్టేషన్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతోంది. మండలం వ్యవసాయరంగం ప్రధానంగా ఉండటంతో అన్ని గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కావడంలేదని ప్రజలు ఆరేళ్లక్రితం గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో నర్సింగాపూర్‌లో మరో సబ్‌స్టేషన్ నిర్మించేందుకు విద్యుత్ శాఖ ప్రతిపాదనలు చేసింది. ప్రజలు, నాయకుల విన్నపంతో ప్రభుత్వవిప్ బాల్కసుమన్ ఉన్నతాధికారులతో మాట్లాడి సబ్‌స్టేషన్ మంజూరు చేయించారు. సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే నర్సింగాపూర్, బూర్గుపల్లి, దాంపూర్, రెడ్డిపల్లి, కాజిపల్లి, ధర్మారం గ్రామాలతోపాటు నెన్నెల మండలంలోని కొత్తూరు, చిన్నవెంకటాపూర్ గ్రామాలకు మెరుగైన విద్యుత్ సరఫరా అయ్యేది.

రెండేళ్లక్రితం మంజూరు

నర్సింగాపూర్ సబ్‌స్టేషన్ మంజూరు చేస్తూ విద్యుత్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. రూ.1.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. సబ్‌స్టేషన్‌కు అవసరమైన భూమి కోసం బూర్గుపల్లి నుంచి నర్సింగాపూర్ వరకు గల ప్రభుత్వస్థలాలను రెవెన్యూ శాఖ పరిశీలించింది. సర్వే నిర్వహించి నర్సింగాపూర్ వద్ద ఎకరం స్థలాన్ని గుర్తించి విద్యుత్‌శాఖకు అప్పగించింది.

తరచూ అంతరాయం

భీమారం సబ్‌స్టేషన్ నుంచి వచ్చే విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుందని రైతులు అంటున్నారు. లోవోల్టేజీతో మోటార్లు కాలిపోతున్నాయని చెబుతున్నారు. ముఖ్యంగా అటవీప్రాంతం గుండా విద్యుత్ లైన్లు ఉండటంతో ఇబ్బందిగా మారిందని అంటున్నారు. నర్సింగాపూర్‌లో సబ్‌స్టేషన్ ద్వారా మెరుగైన విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం ఉందని వివరిస్తున్నారు.

పనులు ప్రారంభించాలి



విద్యుత్ శాఖ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభించాలి. రైతులకు ఉపయోగపడే ఎకరం భూమిని ప్రభుత్వం విద్యుత్ శాఖకు కేటాయించింది. ఇందులో పనులు ప్రారంభిస్తే రెండేళ్లలో ఎప్పుడో పూర్తయ్యేది. - పెద్దల బాపు, నర్సింగాపూర్

నిధులు మంజూరు కాగానే



నర్సింగాపూర్‌లో 33 కేవీ 11 కేవీ విద్యుత్ కసబ్‌స్టేషన్ మంజూరైంది. అయితే దీనికి సంబంధించిన ఫైల్ సీఎండీ కార్యాలయంలో ఉంది. నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభిస్తాం. - కుమారస్వామి, విద్యుత్‌శాఖ ఏఈ భీమారం

కాలు విరిగిందని ఆస్పత్రికి వస్తే..
కానరాని లోకాలకు

- వారంపాటు చికిత్స.. అయినా దక్కని ప్రాణం
- జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఘటన
- న్యాయం చేయాలంటూ బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన



చంద్రయ్య (ఫైల్)

మంచిర్యాలక్రైం: కాలు విరిగిందని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చిన ఓ వ్యక్తి కానరాని లోకాలకు చేరిన ఘటన జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరువంచ గ్రామానికి చెందిన చంద్రయ్య పూజల్వార్(56) ఇంటివద్ద జారిపడ్డాడు. కుడి మోకాలు ఎముక విరిగింది. ఈనెల 2న మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చాడు. పరీక్షల అనంతరం ఆపరేషన్ అవసరమని వైద్యులు చెప్పారు. ఇందుకు రూ.80 వేల ప్యాకేజీ ఖరారు చేశారు. అడ్వాన్సుగా రూ.25 వేలను పేషంట్ కుటుంబ సభ్యులు చెల్లించారు. అయితే ఆపరేషన్ తర్వాత పేషంట్ పరిస్థితి రోజురోజుకు దిగజారడంతో పలుమార్లు వేరే ఆసుపత్రికి తీసుకెళ్తామని బంధువులు డాక్టర్లను అడిగారు. ఎక్కడైన ఇదే ట్రీట్‌మెంట్ ఉంటుందని, ఏమి కాదని చెప్పినట్లు వారు పేర్కొన్నారు. ఈ క్రమంలో శుక్రవారం పరిస్థితి విషమించగా వేరే ఆసుపత్రికి తీసుకెళ్లామని వైద్యులు చెప్పడంతో బంధువులు నిలదీశారు. అప్పటికే చంద్రయ్య మృతిచెందిన విషయం కుటుంబ సభ్యులకు తెలిసిపోయింది. వైద్యుడి నిర్లక్ష్యంవల్లే చంద్రయ్య మృతి చెందాడని ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట వారు ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు బాధిత కుటుంబీకులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. ఈ విషయమై సదరు వైద్యుడు శ్రీధర్‌ను ఫోన్‌లో వివరణ కోరగా తన తప్పేమి లేదని చెప్పడం గమనార్హం.



ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

వైద్యుడి నిర్లక్ష్యంతోనే మృతి: కుటుంబ సభ్యుల ఆరోపణ

వైద్యుడి నిర్లక్ష్యం వల్లే చంద్రయ్య మృతి చెందాడని కుటుంబసభ్యులు ఆరోపించారు. ఆసుపత్రికి తన భర్త స్వయంగా నడుచుకుంటూ వచ్చాడని, ఆయనకు ఇతర అనారోగ్య సమస్యలు లేవని భార్య రాజేశ్వరి తెలిపింది. ముందుగా వేరే ఆసుపత్రికి తీసుకెళ్తామంటే డాక్టర్లు వద్దన్నారు. మంచి ట్రీట్‌మెంట్ ఇస్తున్నామని చెప్పి చివరకు చంపారని బోరున విలపిస్తూ ఆరోపించింది. కాగా, మృతుడికి ఇద్దరు కుమారులు ప్రశాంత్, రాజేష్, కుమార్తె సాద్నా ఉన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న అర్పిత మారంరెడ్డి

లక్సెట్టిపేట: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ అర్పిత మారంరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్పిత మారంరెడ్డి మాట్లాడుతూ విద్యార్థిదశ నుంచే చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. వివిధ చట్టాలు, హక్కులపై వారికి అవగాహన కల్పించారు. ఎలాంటి సమస్యలున్నా కోర్టులో లీగల్ ఎయిడ్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. ఈనెల 30న నిర్వహించే లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవాలన్నారు. జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ మాట్లాడుతూ మొబైల్ యాప్‌ల ద్వారా మోసాలు జరుగుతున్నాయని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు కారుకూరి సురేందర్, ఏజీపీ పద్మ, న్యాయవాదులు అక్కల శ్రీధర్, రెడ్డిమల్ల ప్రకాశం, తాజోద్దీన్, రవి, గణేశ్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



నిరుపయోగంగా ట్రాలీలు

నస్పూర్: మున్సిపల్ పరిధిలోని తీగల్‌పహాడ్ పాత గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట మూడు చెత్త ట్రాలీలు నిరుపయోగంగా మారాయి. ఒక్కో ట్రాలీని సుమారు రూ.4.50 లక్షలకు కొనుగోలు చేసిన అధికారులు వాటిని వినియోగించకపోవడంతో కొన్నినెలలుగా మూలనపడ్డాయి. ఆరుబయట ఉండడంతో ట్రాలీల టైర్లు, బ్యాటరీలను దొంగల ఎత్తుకెళ్లారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ట్రాలీలు రాకపోవడంతో వార్డుల్లో చెత్త పేరుకుపోయిందని ప్రజలు గగ్గోలు పెడుతుంటే, మరోవైపు ట్రాలీలను వినియోగించుకోవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల పట్టణవాసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కాసిపేట: మండలంలోని 33/11కేవీ కొండపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయ కలుగుతుందని ఏఈ స్వర్ణలత ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

దండేపల్లి: మండలంలోని ముత్యంపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ మరమ్మతుల నేపథ్యంలో శనివారం సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రాయనర్సు ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధి గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మందమర్రిరూరల్: మండలంలోని అందుగులపేటలో గల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ మల్లేశం తెలిపారు. జీఎం ఆఫీస్, ఏరియా, యాపల్, కేకే-2 గని ఏరియా ఊరు మందమర్రి, మార్కెట్ ఏరియా, దీపక్‌నగర్, పాలచెట్టు ఏరియా, పులిమడుగు, అందుగులపేట, కోటీశ్వరరావుపల్లె, బొక్కలగుట్ట ఏరియాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట సబ్‌స్టేషన్ మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ గణేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్కూర్, లక్సెట్టిపేట, మోదెల, గంపలపల్లి, ఇటిక్యాల గ్రామాల విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

ఉన్నత స్థానాలకు చేరుకోవాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కాంతయ్య



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

లక్సెట్టిపేట: విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థానాలకు చేరుకోవాలని మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య ఆకాంక్షించారు. మండలకేంద్రంలోని మోడల్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తోందన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలన్నారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు పలువురిని అలరించాయి. సామాజిక కార్యకర్త పాటిబండ్ల శ్రీరామూర్తి, ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజా, దండేపల్లి హెచ్‌ఎం శోభ, సుమతమ్మ, చెట్ల రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వినోద్‌ను కలిసిన ఎస్సీ, ఎస్టీ నాయకులు



వినోద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన అఖిల భారత ఎస్సీ, ఎస్టీ సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు అడ్డూరి వెంకటస్వామి, రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌రాజ్‌తో కలిసి కొత్తగా ఎన్నికైన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని స్వగృహంలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలని ఆకాంక్షించారు.

దరఖాస్తు చేసుకోండి

దండేపల్లి: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో 2023-24 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లు పొందేందుకు ఈనెల 11లోగా దరఖాస్తులు చేసుకోవాలని దండేపల్లి ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శంకర్‌గౌడ్, సహాయ కోఆర్డినేటర్ రాజేశ్వర్ రావు తెలిపారు. వివరాలకు సెల్ 8309769067లో సంప్రదించాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మంచిర్యాలటౌన్: రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఏసీసీ 3 అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యశిబిరం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాము, డాక్టర్ రజిత ఆధ్వర్యంలో చిన్నారులకు ఎనిమియా, పుట్టుకతో వచ్చే వ్యాధులు, చలికాలంలో ఎదురయ్యే చర్మ సంబంధిత వ్యాధులకు సంబంధించిన ఆరోగ్య పరీక్షలు చేశారు. చలికాలం కావడంతో చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్యులు సూచించారు. అంగన్‌వాడీ టీచర్ ఎస్.పద్మ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి పీఎస్సార్ ప్రత్యేక ప్రణాళిక



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు తోట రవి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల అభివృద్ధికి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగనున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట రవి అన్నారు. హాజీపూర్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో కాంగ్రెస్ పార్టీకి 8 వేల మెజారిటీ ఇచ్చారని, ఈ క్రమంలో అభివృద్ధి, సంక్షేమంతో మండల ప్రజల మదిలో ప్రేమ్‌సాగర్‌రావు కలకాలం నిలిచి ఉంటారని అన్నారు. అవినీతి, భూ కబ్జాలు పాల్పడిన వారికి సైతం తగిన గుణపాఠం చెబుతూ నీతి, నిజాయితీతో కూడిన పారదర్శక పాలన అందిస్తారని చెప్పారు. మండల నాయకుడు పూస్కూరి శ్రీనివాసరావు తాత మురళీమనోహర్‌రావు పాఠశాల, ఆస్పత్రి, పోలీస్ స్టేషన్లకు భూములు అందించారని గుర్తు చేస్తూ ఇకపై అనవసర ఆరోపణలు చేయకుండా సుపరిపాలనకు సహకరించాలని కోరారు. సమావేశంలో రైతుబంధు సమితి మండల కన్వీనర్ పూస్కూరి శ్రీనివాసరావు, ఎంపీటీసీ డేగ బాపు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాసగౌడ్, ఉప సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు జితేందర్‌రావు, నాయకులు శ్రీశైలంగౌడ్, బొడ్డు శంకర్, ఒడ్డె శ్రీనివాస్, రాజ్‌కుమార్, సాంబారి కుటుంబరావు పాల్గొన్నారు.

'ఆరోపణలు నిరూపించాలి'

చెన్నూర్‌రూరల్: చెన్నూర్‌లోని బాబూపేటలో పేదలకు భూములు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేశానని కొందరు తనపై చేసిన ఆరోపణలు నిరూపించాలని సీపీఎం జిల్లా నాయకుడు అవేజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తక్కువ సమయంలో ప్రజల మన్ననలు పొందానని, కొందరు అక్కసుతో తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. నాయకులు మధు, శంకర్, సురేష్, సమ్మయ మధునయ్య, రేణుక, లక్ష్మి, రాజక్క, భూపోరాట కమిటీ సభ్యులు ఉన్నారు.

లైంగికంగా వేధిస్తే ఫిర్యాదు చేయండి

మందమర్రిరూరల్: సింగరేణిలో మహిళా ఉద్యోగులపై ఎవరైన లైంగిక వేధింపులకు పాల్పడితే సంస్థ ఏర్పాటు చేసిన ఇంటర్నల్ కమిటీ మెంబర్స్‌కి ఫిర్యాదు చేయాలని ఎస్వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో గల కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వేచ్ఛా వాతావరణంలో ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. పని స్థలాల్లో లైంగిక వేధింపుల సమస్య పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేసామన్నారు. ఈ సమావేశంలో ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాం సుందర్, ఎస్టేట్ ఆఫీసర్ కుమారస్వామి, డీవైసీఎంవో డాక్టర్ ఉషా పాల్గొన్నారు.



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయరూ..

నస్పూర్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో మిషన్ భగీరథ నీరు సరఫరా చేసే పైపులైన్ ఏయిర్ వాల్ జాతీయ రహదారికి ఆనుకుని ఉంది. ఎయిర్‌వాల్‌కి రేడియం కానీ, మరే ఇతర హెచ్చరిక బోర్డు లేకపోవడంతో వాహనదారులు దానికి తగిలి కిందపడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి వాల్‌చుట్టూ హెచ్చరిక బోర్డు లేదా రేడియం స్టిక్కర్ అయినా అంటించాలని పలువురు కోరుతున్నారు.

10న వృద్ధుల సమావేశం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో గల సన్‌షైన్ డే కేర్ సెంటర్‌లో ఈ నెల 10న మంచిర్యాల వయో వృద్ధుల సంక్షేమ సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు బొలిశెట్టి రాజలింగు, సైండ్ల మొండయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సమావేశంలో నూతన కార్యవర్గం ఏర్పాటు, ఇతరత్ర సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

ఈ-శ్రమ్ కార్డుదారులకు ప్రమాద బీమా

పాతమంచిర్యాల: ఈ శ్రమ్‌కార్డుదారులు ప్రమాదవశాత్తు మృతిచెందితే నామినీకి కేంద్రం ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ద్వారా రూ.2 లక్షల ప్రమాద బీమా(ఎక్స్‌గ్రేషియా) చెల్లిస్తుందని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వినీత తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు ఆధార్‌కార్డు ఈశ్రమ్‌కార్డు డెత్ సర్టిఫికెట్లతో లేబర్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.